




# కరపత్రం

SINCE 2014

బుధవారం ,నవంబర్ 27, 2024 సంపుటి :0 సంచిక : 49 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు: 4


# ఇచ్చిన మాట ప్రకారం కులగణన

### కులగణనతోనే ఆర్థిక, సామాజిక న్యాయం

### రాహుల్ మాట మేరకు తెలంగాణలో విజయవంతం

### ఎఐసిసి సంవిధాన్ రక్షణ అభియాన్ కార్యక్రమంలో సిఎం రేవంత్





2లో

## వరంగల్‌తో పాటు మరో 3 విమానాశ్రయాలు ఏర్పాటు చేయండి: సీఎం రేవంత్‌రెడ్డి

దిల్లీ: దిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశమయ్యారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు ఉన్నారు.

2లో

## జర్నలిస్టులకు ఇల్లస్థలాల వ్యవహారం

### కాంగ్రెస్, బిఆర్ఎస్ పాలకులదే పాపం

### మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్



2లో

## మాగనూరు స్కూల్లో వికటించిన మధ్యాహ్న భోజనం

- 21మంది విద్యార్థులకు అస్వస్థత..
- వారం రోజుల్లో వరుసగా రెండో ఘటన

ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు



నారాయణపేట జిల్లా మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మరోసారి మధ్యాహ్న భోజనం వికటించి 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. విద్యార్థులు రోజు మాదిరిగానే మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం తిన్న తర్వాత 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో వెంటనే వారిని మాగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

2లో

## పరామర్శించటానికి వెళ్తే అడ్డుకుంటారా : ఎమ్మెల్సీ కవిత

- నియంతృత్వ పోకడలకు నిదర్శనం సీఎం రేవంత్‌రెడ్డి



ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఫుడ్ పాయిజన్‌తో మరణించిన గిరిజన పాఠశాల విద్యార్థిని శైలజ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మీ, అనిల్ జాదవ్‌ను అడ్డుకోవడం దురదృష్టకరమని ఎమ్మెల్సీ కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగ దినోత్సవం నాడే రాజ్యాంగ హక్కులకు రేవంత్ ప్రభుత్వం తూర్పార పొడస్తోందని విమర్శించారు. నియంతృత్వ పోకడలకు రేవంత్ రెడ్డి సర్కార్ నిదర్శనమని అన్నారు. ఫుడ్ పాయిజన్‌తో మరణించిన వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ స్వగ్రామం బాదాలో పోలీసులు భారీగా మోహరించారు. శైలజ మృతదేహం ఆసిఫాబాద్ జిల్లా బాదా గ్రామానికి చేరుకున్నది. దీంతో ఆమె బంధువుల, గ్రామస్తులు అంబులెన్స్‌ను చుట్టుముట్టి నిరసన వ్యక్తం చేశారు. ఆమె డెడ్‌బాడీని అందులోని నుంచి దించకుండా అడ్డుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వారందరిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని అడుగడుగునా మోహరించారు. గ్రామంలోకి ఇతరులు ఎవరూ రాకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు. సరైన ధృవపత్రాలు చూపిన తర్వాతే గ్రామానికి అనుమతిస్తున్నారు. మీడియాపై ఆంక్షలు విధించారు.

## మేము ఎవరి కాళ్లు ఒత్తలేదు రేవంత్‌రెడ్డి పెద్ద శాడిస్ట్

హైదరాబాద్, ప్రశ్నిస్తే తాను సైకోనా అని ప్రశ్నించారు. కొండారెడ్డిపల్లిలో నీ కోసం పనిచేసిన మాజీ సర్పంచ్ ఆత్మహత్యకు కారణమయ్యావన్నారు. మరి నువ్వు శాడిస్ట్ వా అని నిలదీశారు. నువ్వు తప్పు చేసి మా మీద రుద్దే ప్రయత్నం చేస్తున్న శాడిస్ట్ ముఖ్యమంత్రివని ఫైరయ్యారు. ఏం చేస్తావో చేసుకో, తాము నీకు భయపడేవాళ్ల కాదన్నారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'మృత్యువుతో పోరాడి చనిపోయిన శైలజకు సంతాపం తెలిపారు. గురుకులాల్లో చనిపోయిన 48 మంది విద్యార్థుల మృతిబాధాకరమని పేర్కొన్నారు. గురుకులాల్లో పరిస్థితులపై రేవంత్ ఇప్పటివరకు సమీక్ష జరపలేదని, ఆందోళనలో ఉన్న లక్షలాది మంది గురుకుల విద్యార్థుల కుటుంబాల తరపున రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని తప్పకుండా నిలదీస్తాం, చీల్చి చెండాడుతామని హెచ్చరించారు. రాహుల్ తిట్టినందుకు రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నాడని,

2లో




- తాము ఎవరి కాళ్లు ఒత్తలేదని, లుచ్చ పనులు అసలే చేయలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నీ లెక్క లుచ్చా పనులు చేసి..
- ఆయన కాళ్లు ఒత్తుకుంటూ ఉండే అలవాటు తనది కాదని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు.
- ఫ్రస్టేషన్‌లో తనను తిడుతున్నావ్ సరే తనకు ఏమీ ఫరక్ పడదన్నారు.

## హరీశ్‌రావును కలిసిన టీటీడీ చైర్మన్

- మాజీ మంత్రి హరీశ్‌రావును ఆయన నివాసంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు.
- ఈ సందర్భంగా బీఆర్ నాయుడికి పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.
- మీడియా రంగంలో సుదీర్ఘకాలంగా విశేష సేవలు అందించిన నాయుడికి కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి సేవ చేసే భాగ్యం పొందడం అదృష్టమని హరీష్ రావు అభిప్రాయపడ్డారు.

2లో



# సంపాదకీయం

## ‘మహా’ విపక్షాల భవిష్యత్తు ఏమిటి?

ఈ శతాబ్దం తొలినాళ్ల మాట. మహారాష్ట్రలో బీజేపీ%–%శివసేన పొత్తుకు ప్రధాన కారకుడు అయిన బీజేపీ నాయకుడు ప్రమోద్ మహాజన్ (ఇప్పుడు కీర్తిశేషుడు)ను, ‘కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్న భారతీయ జనతా పార్టీ మహారాష్ట్రలో శివసేనకు జూనియర్ భాగస్వామిగా ఉండడానికి ఎందుకు అంగీకరించిందని’ ప్రశ్నించాను. ఆయన ఇలా సమాధానమిచ్చారు: ‘రాజకీయాలలో ఎవరైనా సరే తమ సమయం వచ్చే దాకా వేచి ఉండాల్సిందే. వాజపేయి ఇప్పుడు దేశవ్యాప్తంగా అందరి గౌరవాదరాలు పొందుతున్న సమున్నత నేత. అయితే మహారాష్ట్రలో బాలా సాహెబ్ ఠాక్రే నాయకత్వం అవసరం మాకు, ప్రతి ఒక్కరికీ ఉంది. ఏదో ఒక రోజు శివసేన అవసరం మాకు ఉండక పోవచ్చు. ఆ సమయం వచ్చినప్పుడు మేమే అన్నిటినీ నిర్దేశిస్తాం’. దాదాపు రెండు దశాబ్దాల అనంతరం, శివసేన అధినేత బాలా సాహెబ్ మరణించిన పన్నెండేళ్లకు, ప్రమోద్ మహాజన్ స్వప్నాన్ని బీజేపీ తిరుగులేని రీతిలో సాధించింది: మహారాష్ట్రలో ఇప్పుడు ఎదురే లేని నెంబర్ 1 పార్టీ భారతీయ జనతా పార్టీ. 2024 శాసనసభ ఎన్నికలలో సొంతంగా అత్యధిక మెజారిటీతో గెలుపొంది ఎట్టకేలకు మిత్రపక్షాలను, ప్రత్యర్థి పార్టీలను తన అభీష్టాల ప్రకారం నిర్దేశించగలిగే, నియంత్రించగలిగే ప్రభావ ప్రాబల్యాల విజేతగా ప్రభవించింది.

ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అయిన మహారాష్ట్రలో ఈ పెనుమార్పు ఎలా సంభవించింది? 1988లో పొత్తు కుదుర్చుకున్న బీజేపీ, శివసేనలు రాష్ట్ర, జాతీయ ఎన్నికలలో కలసికట్టుగా పోటీ చేసేవి. అయితే 2014లో ఈ మిత్రపక్షాలు మొట్టమొదటిసారి వేటికవే పోటీ చేశాయి. నరేంద్ర మోదీ పలుకుబడితో బీజేపీ 122 సీట్లు గెలుచుకోగా శివసేన 63 స్థానాలను స్వాయత్తం చేసుకున్నది. హిందుత్వ రాజకీయాలలో, ముఖ్యంగా మహారాష్ట్రలో ఏ పార్టీ ప్రధాన శక్తి అన్నది ఆ ఫలితాలతో స్పష్టమయింది. 2019 శాసనసభ ఎన్నికల అనంతరం కాంగ్రెస్%–% ఎన్‌సీపీ కూటమితో శివసేన కలవడంతో రాష్ట్రంలో కాషాయ కూటమి ఏకైక ప్రతినిధిగా బీజేపీ మిగిలిపోయింది. 2022లో శివసేనను చీల్చడం ద్వారా తన ఒకప్పటి మిత్రపక్షమైన శివసేనను మరింతగా బలహీనపరచడంలో బీజేపీ సఫలమయింది. తాజా శాసనసభ ఎన్నికలలో నాలుగింట మూడు వంతుల మెజారిటీతో తిరుగులేని విజేతగా నిలిచిన బీజేపీ మహారాష్ట్ర రాజకీయాలలో గుత్తాధిపత్యం చెలాయించే పరిస్థితి నెలకొన్నది.

మహారాష్ట్రలో తన ఎదుగుదలకు ప్రధాన ప్రతి బంధకం కాంగ్రెస్ కాదని, ప్రాంతీయ పార్టీలే అన్న సత్యం బీజేపీకి మొదటి నుంచీ బాగా తెలుసు. పశ్చిమ మహారాష్ట్రలో అన్ని విధాల ప్రబలంగా ఉన్న సహకార సంఘాలు, వాటి పెత్తందారులపై నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి పూర్తి నియంత్రణ ఉండగా మరాఠీ అస్మిత (ఆత్మ గౌరవం)కు శివసేన ప్రతీకగా వెలుగొందుతోంది. ముంబైలో భూమి పుత్రుల ఉద్యమంతో రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన శివసేన మహారాష్ట్రియన్ హిందూ అస్తిత్వం భావోద్వేగాల ఆధారంగా గ్రామీణ మహారాష్ట్రకు కూడా వ్యాపించి వేళ్లూనుకున్నది. మిత్రపక్షాలుగా ఉన్న కాలంలో కూడా బీజేపీ, శివసేనలు ఒకే (హిందూ) ఓటు బ్యాంకును స్వాధీనం చేసుకునేందుకు పోటీపడవలసివచ్చేది. పంజాబ్‌లో మిత్రపక్షమైన అకాలీదళ్ నుంచి బీజేపీకి ఇటువంటి పోటీ ఉండేది కాదు. బీజేపీ%–%శివసేన కూటమి పాతిక సంవత్సరాల పాటు ఎత్తు పల్లాలను చూసింది. మహారాష్ట్రలో వేళ్లూనుకోవడానికి శివసేన స్థానిక పలుకుబడి బీజేపీకి ఎంతైనా అవసరమయ్యేది. బీజేపీ మనుగడకు ప్రధాన ఆలంబనగా ఉన్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ దశాబ్దాలుగా అగ్రవర్ణ, మరీ ముఖ్యంగా బ్రాహ్మిణ్‌ల నాయకత్వంలోని పార్టీగా పేరు పడింది. శివసేనతో జతకట్టడం ద్వారా సంఘ్ పరివార్ తన ప్రజాదరణను పెంచుకోగలిగింది. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీని రాజ్యాధికారం ఆసరాతో బలహీనపరచడంలో బీజేపీ సఫలమయింది. ఆ పార్టీకి చెందిన ఆర్థికంగా, రాజకీయంగా శక్తిమంతులైన నాయకులు అందరిపైన దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పడం జరిగింది. మరి 2023లో ఎన్‌సీపీలో చీలిక సంభవించినప్పుడు పార్టీ ఫిరాయించిన నేతలు అందరూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కేసులను ఎదుర్కొంటున్నవారే కావడంలో ఆశ్చర్యమేముంది? నాయకుల వ్యక్తిగత అధికార లాలస, దర్యాప్తు సంస్థల ఒత్తిడి, భావజాలపరమైన విభేదాల కలగలుపు ఫలితంగా శివసేనలో చీలిక సంభవించింది. కాంగ్రెస్‌తో శివసేన పొత్తు పెట్టుకోవడం ఒక ఆశ్చర్యకర పరిణామం. ఎందుకని? బాబ్రీ మసీదును కూల్చివేసిన ఘనత తమదే అని ఘనంగా చాటుకున్న పార్టీ అసలు రాముడి అస్తిత్వాన్నే అంగీకరించని పార్టీతో కలవడమేమిటి? అని శివసేన కార్యకర్తలు సహజంగానే విస్మయం చెందారు. అయోమయంలో పడ్డారు. తమ నాయకులు తమను మోసగించారని అభిప్రాయపడ్డారు. అధికార లాలస అమితంగా ఉన్న ఏక్‌నాథ్ శిందే బీజేపీ ప్రోత్సాహంతో ఉద్ధవ్ ఠాక్రే పార్టీ భావజాలాన్ని ఉపేక్షించడాన్ని ప్రశ్నించారు. ఎదురు తిరిగారు. బాలాసాహెబ్ వారసత్వానికి తానే నిజమైన యోగ్యుడనని చాటుకున్నారు, నిరూపించుకున్నారు. ఈ పరిణామాల మధ్య ఉద్ధవ్ ఠాక్రే పార్టీని కాపాడుకునేందుకు చాలా కష్టాలు పడ్డారు.

శివసేనలో చీలిక బీజేపీ తన ప్రాభవాన్ని పెంచుకునేందుకు ఒక అవకాశాన్ని కల్పించింది. నరేంద్ర మోదీ%–%అమిత్ షా నేతృత్వంలోని బీజేపీ, వాజపేయి%–%అద్వానీ ద్వయం పాటించిన సమ్మిళిత సంకీర్ణ ధర్మాలను క్రమంగా త్యజిస్తూ ఒక ప్రాంతీయ పార్టీతో ఏర్పాటు చేసుకున్న కూటమిలో తానే ఆధిపత్య పక్షంగా వ్యవహరించడం జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికలలో వరుసగా రెండుసార్లు విజయం సాధించడంతో రాష్ట్ర స్థాయి భాగస్వామ్యపక్షాలు తాను నిర్దేశించిన విధంగా వ్యవహరించేలా చేయడంలో పూర్తిగా సఫలమవుతోంది. అసోంలో అసోం గణ పరిషత్ ఇప్పుడు బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వంలో ఒక జూనియర్ భాగస్వామిగా ఉన్నది. గోవాలో ఒకప్పుడు సర్వాధిపత్యంతో వ్యవహరించిన మహారాష్ట్ర వాది గోమంతక్ పార్టీ ఇప్పుడు బీజేపీకి ఒక చిన్న అనుబంధ పార్టీ మాత్రమే? కర్ణాటకలో జనతాదళ్ (ఎస్) బీజేపీ నిర్దేశించినట్లు వ్యవహరించాల్సిందే. నితీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ఉన్న బిహార్‌లో సైతం తన సమయం కోసం బీజేపీ ఓర్పుతో వేచివున్నది. ఎన్‌డీఏలోని ఇతర భాగస్వామ్య పక్షాలు చిరాగ్ పాశ్వాన్ నాయకత్వంలోని లోక్ జనశక్తి, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ అనివార్యకారణాల వల్లే కూటమిలో ఉన్నాయి కాని భావజాలపరమైన ఏకీభావంతో కాదనేది అందరికీ తెలిసిన విషయమే.

ఇప్పుడు మహారాష్ట్రలో బిగ్‌బాస్ ఎవరు అనేది ఏక్‌నాథ్ శిందే, అజిత్ పవార్‌లకు బాగా తెలుసు. మహిళలకు నేరుగా నగదు బదిలీ చేసే లడ్కీ బహీన్ పథకం ఆలంబనతో తనను తాను సామాన్యమానవుని సంక్షేమానికి మొదటి ప్రాధాన్యమిచ్చిన ముఖ్యమంత్రిగా ప్రజాదరణను పెంచుకోవడానికి సకల ప్రయత్నాలు చేశారు. ఆయనకు ప్రజాదరణ పెరిగిందనడంలో సందేహం లేదు. అయినప్పటికీ బీజేపీ ప్రాపకం పైనే శిందే ఆధారపడి ఉన్నారన్నది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. అజిత్ పవార్ సైతం తన బాబాయి శరద్ పవార్ నీడ నుంచి బయటపడి సొంతంగా వెలుగొందుతున్నప్పటికీ బీజేపీ ఎప్పుడైనా సరే తనపై కేసులు మోపగలదనే సత్యాన్ని విస్మరించలేరు. ఒక విధంగా మహారాష్ట్ర ప్రాంతీయ పార్టీల నాయకులు అందరూ ఒక జనరల్ ఆదేశాలను పాటించే బెటాలియన్ కమాండర్లు మాత్రమే.

గుజరాత్‌లో మాదిరిగా మహారాష్ట్రలో కూడా ప్రతిపక్షాలు మళ్లీ అధికారానికి రాలేని పరిస్థితి నెలకొంటుందా అనేది ఇప్పుడు మన ముందున్న ప్రశ్న. గుజరాత్‌లో బీజేపీ తన తిరుగులేని ప్రాబల్యాన్ని చాల తేలిగ్గా సాధించుకోగలిగింది. ఆ రాష్ట్రంలో బీజేపీని సమర్థంగా ఎదుర్కోగల ప్రతిపక్షమేదీ లేకపోవడమే అందుకు కారణమని చెప్పవచ్చు. మహారాష్ట్రలో సాహు–ఫూలే–అంబేడ్కర్‌ల ప్రగతిశీల సామాజిక వారసత్వం ప్రభావశీలంగా ఉన్నది. వెనుకబడిన కులాల, దళిత వర్గాల ఉద్యమాలు, రాజకీయాలపై మధ్యేవాద శక్తులు, వామపక్షాల ప్రభావం బలంగా ఉన్నది. ఈ కారణంగా సంఘ్ పరివార్ మహారాష్ట్ర సమాజం, రాజకీయాలపై తన పట్టును సాధించుకోవడంలో అనేక ప్రతిబంధకాల నెదుర్కొంటున్నది. 2024 శాసనసభ ఎన్నికల ఫలితాలు ఆ సుదృఢ ప్రగతిశీల వారసత్వం పరిమితులను బహిర్గతం చేసింది.

# ఇచ్చిన మాట ప్రకారం కులగణన

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో ఇచ్చిన మాట ప్రకారం కుల గణన చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంవిధాన్ రక్షణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, దళితులకు, ఆదివాసులకు భూ చట్టాలు తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. భారత్ జోడో యాత్ర పేరిట రాహుల్ గాంధీ అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ వారి ఇబ్బందులు తెలుసుకున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో రిజర్వేషన్లు అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు గాంధీ పరివార్ ఉందని.. రాహుల్ గాంధీకి అండగా తాము ఉన్నామని వ్యాఖ్యానించారు. రైతుల తరపున నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ అందోళన చేశారని.. అందుకే కేంద్రం నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందని వివరించారు. తెలంగాణ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా కులగణన చేపట్టింది. కొన్ని చోట్ల ఇప్పటికే ప్రజల నుండి వివరాలు నమోదు చేసుకుంది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో సర్వేను పర్యవేక్షిస్తూ సర్వే సిబ్బందికి మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్వేలో మొత్తం 85 వేల మంది ఎన్యుమరేటర్లు, 8,500 మంది సూపర్‌వైజర్లు పాల్గొంటున్నారు. ఇంటి నంబరు, యజమాని పేరు నమోదు చేసే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు పాల్గొంటున్నారు. ప్రతి కుటుంబంలో సభ్యులందరి ఫోన్, ఆధార్ నంబర్లు సహా సమస్త వివరాలతో కూడిన 75 ప్రశ్నలను అడిగి నమోదు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో మొత్తం 1,17,44,954 కుటుంబాలున్నాయని.. ఇళ్లను 87,092 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించి కులగణన చేపట్టినట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ తెలిపారు.

అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కాంగ్రెస్?తోనే సాధ్యమని, రాహుల్ గాంధీ నాయకత్వంలో అందరికి సామాజిక న్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితర కీలక నేతలు హాజరయ్యారు. దేశంలో రాజ్యాంగ పవిత్రతను కాపాడింది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. గాంధీ పరివార్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తుంటే.. మోడీ పరివార్ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తోందన్ని ÷ర్ అయ్యారు. రాజ్యాంగ పరిరక్షణలో రాహుల్ గాంధీ వెంట దేశ ప్రజలంతా ఉన్నారన్నారు. ప్రతి ఒక్క వర్గానికి కాంగ్రెస్ పార్టీ న్యాయం చేసిందని.. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు కాపాడింది కాంగ్రెస్సేనని వ్యాఖ్యానించారు.

కుల గణనతోనే ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని.. ఇందుకోసమే దేశవ్యాప్తంగా కుల గుణన కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని తెలిపారు. దేశంలో సామాజిక న్యాయాన్ని అందించింది ఒక్క కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట ప్రకారమే తెలంగాణలో కుల గణన చేపట్టామని.. కుల గణన సర్వే ఇప్పటి వరకు 92 శాతం పూర్తి అయ్యిందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జన గణన సర్వేలోనూ కులాల లెక్కలు తీయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

# వరంగల్‌తో పాటు మరో 3 విమానాశ్రయాలు ఏర్పాటు చేయండి: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాల గురించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా వరంగల్ ఎయిర్ పోర్టు పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. భూ సేకరణ ఎంత తొందరగా పూర్తయితే.. అంత త్వరగా ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు చేపడతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఎయిర్ పోర్టు నిర్మాణాలు చేపట్టాలని సీఎం ప్రతిపాదించారు. ఆయా ప్రాంతాల్లో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

# జర్నలిస్టులకు ఇళ్లస్థలాల వ్యవహారం

మొదటిపేజీ తరువాయి

జేఎన్‌జే జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన ఇండ్ల స్థలాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పును వెలువరించడం అత్యంత బాధాకరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈ విషయంపై మంగళవారం హైదరాబాద్‌లో బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును గౌరవించాల్సిందేనని స్పష్టం చేశారు. అయితే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు దక్కకపోవడానికి పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీతోపాటు ప్రస్తుత కాంగ్రెస్ పాలకులే ప్రధాన కారణమని విమర్శించారు. 7 ఏళ్ల క్రితం పుస్తెలు తాకట్టు పెట్టి, అప్పు చేసి ఒక్కో జర్నలిస్టు రూ.2 లక్షల చొప్పున రూ.12 కోట్లు పోగు చేసి ప్రభుత్వానికి చెల్లించి జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ పేరుతో స్థలాలు దక్కించుకున్నారని గుర్తుచేశారు. నాటి నుంచి నేటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఏదో ఒకసాకు చూపుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు చేతికి అందించకుండా తీవ్రమైన అన్యాయం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో జర్నలిస్టుల బతుకులు మరీ దుర్భరంగా ఉన్నాయని వాపోయారు. ఇండ్ల స్థలాలడిగితే లాఠీలతో కొట్టించారని ఆక్షేపించారు. ప్రశ్నించే జర్నలిస్టులను వారి వృత్తిలో కొనసాగకుండా అడుగడుగునా అవమానించిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయని బండి సంజయ్ గుర్తుచేశారు. ‘బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్య ఫలితమే నేటి సుప్రీంకోర్టు తీర్పు. ఈ రెండు పార్టీలు జర్నలిస్టులను రోడ్డు పాల్జేయడమే కాకుండా చేతికి వస్తుందని వేయికళ్లతో ఎదురు చూసిన ఇండ్ల స్థలాలను చేతికి అందకుండా చేశాయి. జర్నలిస్టుల నోటికాడ ముద్దను లాగేసుకున్నాయి. సుప్రీంకోర్టు తీర్పుతో జర్నలిస్టు కుటుంబాల బాధ వర్ణణాతీతం. అసలు జర్నలిస్టులు చేసిన తప్పేమిటి. ఈ రెండు పార్టీలకు జర్నలిస్టులపై ఎందుకంత కక్ష. పైసాపైసా కూడబెట్టి డబ్బులు చెల్లించినా ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా 17 ఏళ్లు జాప్యం చేస్తారా. నేటి సమాజంలో జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివి. చాలీచాలని జీతాలతో బతుకీడుస్తున్నారు. అయినా తమ వార్తలతో నిరంతరం సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు అహర్నిశలు తపన పడతున్నారు. ప్రభుత్వం వాళ్లకు కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా అన్యాయం చేస్తోంది. వాళ్లకు హెల్త్ కార్డులు కూడా పనిచేయడం లేదు. ఉండటానికి ఇండ్లు లేక అ÷–దదె కట్టలేక, పిల్లల ఫీజులు కూడా చెల్లించే స్థోమత లేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా కుటుంబం కంటే సమాజాన్ని చైతన్యవంతం చేయడమే ప్రధానమని నమ్మి జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నారు. ఇండ్ల స్థలాల కోసం ఎదురుచూసి ఎంతోమంది జర్నలిస్టులు అసువులు బాశారు. జర్నలిస్టులను ఆదుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తీవ్రంగా విఫలమయ్యాయి‘ అని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.


‘ఇకనైనా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి. సుప్రీంకోర్టు తీర్పు బాధాకరమే అయినప్పటికీ ప్రభుత్వం తనకున్న విచక్షణ అధికారాలను ఉపయోగించి జర్నలిస్టులకు ఇండ్లను కేటాయించాలి. అలాగే గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఇండ్లులేని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలను వెంటనే మంజూరు చేయాలి. ఈ విషయంలో ప్రభుత్వానికి భారతీయ జనతా పార్టీ పక్షాన పూర్తిగా సహకరించేందుకు సిద్ధం. అలాగాకుండా ఇండ్ల స్థలాలివ్వకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తే తాము చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. జర్నలిస్టులతో కలిసి మహోద్యమానికి కార్యాచరణ రూపొందిస్తాం. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పట్టిస్తాం. అదే

సమయంలో జర్నలిస్టులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బీజేపీ అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌లోని జేఎన్జే హౌసింగ్ సొసైటీ జర్నలిస్టులతోపాటు రాష్ట్రంలోని అర్హులైన విలేకరులందరికీ ఇండ్లను కేటాయిస్తాం‘ అని బండి సంజయ్ హామీ ఇచ్చారు.

# మాగనూరు స్కూల్లో వికటించిన మధ్యాహ్న భోజనం

మొదటిపేజీ తరువాయి

గత బుధవారం ఇదే పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 50 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనకు కారణాలపై వెంటనే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో మురళీధర్‌రెడ్డి, భోజన నిర్వహణ ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బాపురెడ్డిలను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్యా సంచాలకుడు ఈవీ నర్సింహారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆ పాఠశాల మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేశారు. ఆ ఘటన మరువక ముందే మరో 21 మంది విద్యార్థులు ఆసుపత్రి పాలు కావడం గమనార్హం. నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరోసారి ఫుడ్‌పాయిజన్ జరగడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్



నాయకులు హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఫుడ్‌పాయిజన్ జరిగి 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై పది రోజులు కూడా గడవకముందే మళ్లీ ఫుడ్‌పాయిజన్ జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరోసారి ఫుడ్‌పాయిజన్ జరగడంపై హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. ఫుడ్‌పాయిజన్ జరిగి 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై పది రోజులు కూడా గడవకముందే మళ్లీ ఫుడ్‌పాయిజన్ జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాంతులు, కడుపునొప్పితో 30 మంది విద్యార్థులు జిల్లా దవాఖానాలో చేరిన దుస్థితి నెలకొందని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుస ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నా, ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా కనీస చర్యలకు ఉపక్రమించడం లేదని విమర్శించారు. విద్యార్థులకు కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామన్న సీఎం రేవంత్ రెడ్డి మాటలు నీటి మూటలే అయ్యాయని అన్నారు. మాటలే తప్ప చేతలు లేని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య తీరు వల్ల ఇంకెంత మంది విద్యార్థులు ఆస్పత్రి పాలవ్వాలని.. ఇంకెందరు ప్రాణాలు కోల్పోవాలని ప్రశ్నించారు.

## మేము ఎవరి కాళ్లు ఒత్తలేదు

మొదటిపేజీ తరువాయి

చిట్టినాయుడికి చిప్ దొబ్బినట్లు అనిపిసుందని ఎద్దేవా చేశారు. అదానీతో బీఆర్ఎస్ అనుబంధం ఉందని రేవంత్ ఆరోపించాడని, జాతీయ రహదారుల ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందా?. రక్షణ శాఖ ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉంటాయా?. ఎంపీగా పనిచేసినోడికి ఈ మాత్రం తెలియదా?. 700 కేవీ ట్రాన్స్‌మిషన్ లైన్ల ప్రాజెక్టు కూడా కేంద్రానిదేనని తెలిపారు. డ్రైపోర్ట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తారని, కేంద్రం అనుమతి ఇస్తే డ్రైపోర్టు నిర్మాణం జరుగుతుందన్నారు. మైక్రోసాఫ్ట్ నుంచి రెండు దశల్లో ఒకసారి రూ. 15 వేల కోట్లు. రెండోసారి రూ. 16 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని గుర్తు చేశారు. కానీ ఈ ముఖ్యమంత్రి మాత్రం అది అదానీ డేటా సెంటర్ అని రిలీజ్ చేశాడన్నారు. మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ పెట్టుబడిని అదానీ డేటా సెంటర్ అని తప్పుడు ప్రచారం చేశారు. నీకు సబ్జెక్ట్ తెలియక ఏదీ పడితే అది మాట్లాడితే రాష్ట్ర గౌరవం మంటకలుస్తుంది. గతంలో కూడా విప్రో ఛైర్మన్ సత్య నాదెళ్ల అంటూ నవ్వుల పాలు అయ్యావని కేటీఆర్ అన్నారు. మైక్రోసాఫ్ట్ వచ్చాక ఆమెజాన్ వచ్చిందని, ఆమెజాన్ రూ. 36 వేల కోట్లు పెట్టుబడులు పెట్టిందని అన్నారు. మొత్తం రూ. 67 వేల కోట్ల విదేశీ పెట్టుబడులను మేము తీసుకొస్తే నేను అదానీని కలిశాను అని ఫోటో రిలీజ్ చేశాడన్నారు. బరాబర్ దావోస్‌లో కలిశానని, ఆ ఫోటోను నేనే నా ట్విట్టర్‌లో పెట్టాను. నీలాగా ఇంటికి పిలిపించుకుని నాలుగు గంటలు రహస్యంగా కలవలేదు, కోహినూర్ హోటల్‌లో కాళ్లు పట్టుకోలేదు. నాకు నీలాగా లుచ్చా పనులు చేసే అలవాటు లేదు. ఏదీ చేసిన బజాప్తా చేస్తా. అదానీ మేము అసలు ఎంకరేజ్ చేయలేదు. నీ లెక్క లుచ్చా పనులు చేసే.. ఆయన కాళ్లు ఒత్తుకుంటూ ఉండే అలవాటు నాది కాదు. ఫ్రస్ట్రేషన్‌లో నన్ను తిడుతున్నావ్ సరే నాకు ఏమీ ఫరక్ పడదు. ప్రశ్నిస్తే నేను సైకోనా?. కొండారెడ్డి పల్లిలో నీ కోసం పనిచేసిన మాజీ సర్పంచ్ ఆత్మహత్యకు కారణమయ్యావ్. మరి నువ్వు శాడిస్ట్ వా?. నువ్వు తప్పు చేసి మా మీద రుద్దే ప్రయత్నం చేస్తున్న శాడిస్ట్ ముఖ్యమంత్రివి. ఏం చేస్తావో చేసుకో. నీకు భయపడేవాళ్ల కాదు మేము. కొడంగల్‌లో వృద్ధుడైన సాయిరెడ్డి అనే మాజీ సర్పంచ్‌ని వేధించారు. సాయిరెడ్డి ఇంటిముందు గోడ కడితే బాధతో ఆయన ఆత్మహత్య చేసుకున్నారు. శైలజ కుటుంబానికి పరామర్శకు వెళ్తామంటే మా ఎమ్మెల్యే లక్ష్మిని అడ్డుకున్నారు. కొడంగల్‌లో 9 మిలియన్ మెట్రిక్ టన్నుల సిమెంట్ ఫ్యాక్టరీ పెడతారట. రామన్నపేటలో ప్రజలు తిరగబడితే కొడంగల్‌లో సిమెంట్ ఫ్యాక్టరీ పెడుతున్నారు. అదానీ, అల్లుడు, అన్నలు, బావమరిది కోసం రేవంత్ పనిచేస్తున్నారు. అదానీ గత నెల 14న రేవంత్‌కు చెక్ ఇచ్చాడు. ఇంతవరకు ఆ చెక్ ఎందుకు క్యాష్ చేయలేదు?. అదానీ గజదొంగ అని మొన్న ముంబైలో రేవంత్ మాట్లాడారు. అదానీ గురించి నిన్ననే తెలిసిందని రేవంత్ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారు. అదానీతో రూ.12,400 కోట్ల ఒప్పందాలు ఎందుకు రద్దు చేయడం లేదు. వంద కోట్లు వెనక్కి ఇచ్చి వేల కోట్లు నొక్కేసే కుట్రలు చేస్తున్నారు. గతంలో అదానీ ఆఫర్‌ను కేసీఆర్ తిరస్కరించారు.

## హరీశ్‌రావును కలిసిన టీటీడీ ఛైర్మన్

మొదటిపేజీ తరువాయి

టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తారని హరీష్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తిరుమలలో స్వామి దర్శనం కోసం వస్తున్నందున, తెలంగాణ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యుల సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా బీఆర్ నాయుడిని హరీష్ రావు కోరారు. తెలంగాణ భక్తులకు దర్శనం, వసతి వంటి సేవలను మెరుగుపరచడానికి ఈ చర్యలు ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. హరీష్ రావు విజ్ఞప్తికి బీఆర్ నాయుడు సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సిఫారసు లేఖలను పరిగణనలోకి తీసుకోవడం గురించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో మాట్లాడతానని, టీటీడీ బోర్డులో చర్చించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిద్దిపేటలో కూడా టీటీడీ దేవాలయం నిర్మాణ ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నందున, నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని హరీష్ రావు కోరారు. సిద్దిపేటతో పాటు కరీంనగర్ లో నిర్మాణంలో ఉన్న టీటీడీ దేవాలయ పనులను పూర్తి చేసేందుకు బోర్డులో చర్చిస్తామని నాయుడు హామీ ఇచ్చారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం ,నవంబర్ 27, 2024

# మామూళ్లు తీసుకోవడం మామూలే

కరుణాకర్ మల్లిగారి,
కరపత్రం ప్రతినిధి మేడ్చల్.

- ఎన్ని ఏసీబి దాడులు జరిగినా లంచాల సీరియల్ కొనసాగుతూనే ఉంది.

- దొరికితే దొంగ,లేకపోతే దొర.


తేదీ: 26 నవంబర్ 2024 రోజున ఏసీబి కి పట్టుబడ్డ ఎలక్ట్రిసిటీ ఏఈ బలరాం నాయక్, లైన్‌మెన్ హేమంత్ నాయక్ మరియు మధ్యవర్తి


ఏసీబి దాడిలో పట్టుబడ్డ శామీర్ పేట్ తహసీల్దార్ శ్రీ తోడేటి సత్యనారాయణ


25 అక్టోబర్ 2024 రోజున ఏసీబి కి పట్టుబడ్డ ఘట్ కేసర్ మున్సిపల్ ఏఈ రాజశేఖర్, వర్క్ ఇన్ స్పెక్టర్ సున్నీ

**నిన్న తేదీ: 26 నవంబర్ రోజున మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పరిధిలోని విద్యుత్ శాఖ కార్యాలయంపై మంగళవారం ఏసీబీ అధికారులు దాడి చేశారు.**

11 కేవి లైన్‌ను మార్చడానికి, పాత స్తంభం నుంచి కొత్త స్తంభానికి తీగలు మార్చడానికి మండలానికి చెందిన ఓ వ్యక్తి అధికారులను సంప్రదించాడు.దీనికోసం ఏఈ బలరాం నాయక్ రూ.10 వేలు, లైన్‌మెన్ హేమంత్ నాయక్ రూ. 5 వేలు మధ్యవర్తి ద్వారా లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేశారు.లంచం తీసుకున్న డబ్బును అధికారుల నుంచి స్వాధీనం చేసుకున్నారు.ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసి నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టామని ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే నిర్భయంగా 1064 అనే నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## మేడ్చల్

**గత నెల అక్టోబర్ 8 వ తేదీన ఒక కేసులో పోలీస్ స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఏఎస్ఐ మధుసూదన్ రావు.**

మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి, గౌడవెల్లి గ్రామ పరిధిలోని ఒక గేటెడ్ కమ్యూనిటీ లోని తన విల్లా ఇంటీరియర్ పనులకు ఒప్పందం కుదుర్చుకుని 4 లక్షలు అడ్వాన్స్ తీసుకుని పనులు చెయ్యడం లేదని,పైగా మొత్తం డబ్బులు ముందే ఇవ్వాలని కాంట్రాక్టర్ విశ్వనాథ్ ఇబ్బంది పెడుతున్నాడని ఇంటి ఓనర్ శర్మ అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

**ఈ కేసులో విశ్వనాథ్ ను స్టేషన్ కు పిలిపించిన పోలీస్ ఏఎస్ఐ శ్రీ మధుసూదన్ గారు 2 లక్షల రూపాయల లంచం డిమాండ్ చేశాడు.**

**అంత డబ్బు తన వద్ద లేదని విడతల వారీగా ఇస్తానని చెప్పి 10 వేల రూపాయలు ముందుగా ఏఎస్ఐ కి అందజేశాడు.**

రెండవ విడత లంచం 50 వేల రూపాయలు తీసుకొని రావాలని పోలీసులు వత్తిడి చేస్తే ఏసిబి అధికారులను సంప్రదించి పోలీస్ స్టేషన్ వెనకాల లంచం డబ్బులు అందజేస్తుండగా ఏసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.ఈ కేసులో పై అధికారి త్రుటిలో తప్పించుకున్నాడని సమాచారం.

## ఘట్ కేసర్

**గత నెల తేదీ: 25 అక్టోబర్ 2024 రోజున ఏసీబి కి చిక్కిన ఘట్ కేసర్ మున్సిపల్ అధికారులు.**

వినాయక నిమజ్జనం సందర్భంగా క్రేన్ లు ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ కు బిల్లులు


8 అక్టోబర్ 2024 న ఎసిబి కి చిక్కిన మేడ్చల్ పోలీస్ ఏ.ఎస్.ఐ మధుసూదన్ రావు

మంజూరు చేసేందుకు రూ.80 వేలు లంచం తీసుకుంటూ ఘట్ కేసర్ మున్సిపల్ ఏఈ రాజశేఖర్, వర్క్ ఇన్ స్పెక్టర్ సున్నీ లను ఏసీబీ అధికారులు శుక్రవారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు.

ఏసీబీ రంగారెడ్డి యూనిట్ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఘట్ కేసర్ మున్సిపల్ కాంట్రాక్టర్ శివరాత్రి కుమార్ వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా టెండర్ లో పాల్గొని ఎదులాబాద్ లక్ష్మీ నారాయణ చెరువు వద్ద 3 క్రేన్ లను ఏర్పాటు చేశాడు. అందుకు సంబందించిన రూ.10 లక్షల బిల్లులు రావలసి ఉండగా బోడుప్పల్ కార్పోరేషన్ ఏఈ మంగురావు రాజశేఖర్ ప్రస్తుతం ఘట్ కేసర్ మున్సిపల్ ఇంచార్జి ఏఈ గా భాధ్యతలు నిర్వహిస్తున్నాడు. అవుట్ సోర్సింగ్ వర్క్ ఇన్ స్పెక్టర్ గా మేడే సున్నీలు పలు కారణాలు చెప్తు జాప్యం చేస్తున్నారని బిల్లు మంజూరు కావాలంటే రూ.1.5 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేసేది లేక ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి సూచనల మేరకు ఏఈ కి రూ.80 వేలు, వర్క్ ఇన్ స్పెక్టర్ కు రూ.30 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ మేరకు శుక్రవారం మద్యాహ్నం లంచం డబ్బులు యిచ్చేందుకు బోడుప్పల్ కార్పోరేషన్ కార్యాలయానికి వెళ్లగా ఆఫీసులో వద్దు ఇంటి వద్ద తీసుకుంటానని వెళ్లాడు. కాంట్రాక్టర్ కుమార్ ఏఈ రాజశేఖర్ కు అతని ఇంట్లో లంచం ఇస్తుండగా ఏసీబీ రంగారెడ్డి యూనిట్ డీఎస్పీ ఆనంద్ కుమార్ సిబ్బందితో కలిసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని ఘట్ కేసర్ మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ వర్క్ ఇన్ స్పెక్టర్ మేడె సున్నీ కి ఫోన్ ఫే ద్వారా రూ.30 వేలు పంపటంతో అతన్ని కూడా అదుపులోకి తీసుకున్నారు. తీసుకున్న లంచం డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఎవరెవరి పాత్ర ఉంది ఇంకేవరైనా ఉన్నారా అనే అంశంపై విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. లంచం తీసుకున్న ఇద్దరు నిందితులను రిమాండ్ కు తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ అప్పుడు తెలిపారు.

## శామీర్ పేట్

తేదీ: ఫిబ్రవరి 2024 రోజున ఏసీబి కి పట్టుబడ్డ శామీర్ పేట్ తహసీల్దార్. పట్టాదారు పాసు బుక్ జారీ చేయడానికి ఓ రైతు నుంచి లంచం డిమాండ్ చేశారు తహసీల్దార్ సత్యానారాయణ. పది లక్షలు పుచ్చుకున్నా దాహం తీరలేదు.మరో ఇరవై లకారాలు కావాలన్నాడు. కట్ చేస్తే ఇలా ఏసీబీకి అడ్డంగా బుక్కయ్యాడు. బామ్మర్ది కమ్ పర్సనల్ డ్రైవర్ లంచాల బాగోతం నిర్వహిస్తున్నారు తహశీల్దార్ సత్యనారాయణ. పైకం ఇవ్వకుండా పని కాదంటూ 30 లక్షలు డిమాండ్ చేశారని.. దాంతో ఏసీబీని ఆశ్రయించానని మీడియాతో అప్పుడు చెప్పారు రైతు రామశేషగిరి రావు.

రెవెన్యూ శాఖలో అవినీతి తెగులు ఏ స్థాయిలో వేళ్లూనుకుపోయిందో తహశీల్దార్ అవినీతి ఒక నిదర్శనం.

**అవినీతి ఒక జీవ నదిలా మారింది.**
**ఒక్క మేడ్చల్ అని కాదు దేశమంతా ఈ అవినీతి మురికి గంగా నది పారుతూనే ఉంది.**

**ఈ అవినీతి ప్రవాహం ఆగుతుందా?**
**ఇలాగే ప్రవహిస్తుందా?**

**ఎవరికి వారు వేసుకోవాల్సిన ప్రశ్న ఇది.**

# మెటుపల్లిలో పోలీస్ క్రైం మీటింగ్

**కరపత్రం ప్రతినిధి,కోరుట్ల నియోజక వర్గం**




నిన్న తేది: 26-11-2024 సాయంత్రం మెట్ పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో మెట్ పల్లి పోలీస్ సర్కిల్ సమావేశం జరిగింది.మెట్ పల్లి సర్కిల్ పరిధిలోని మెట్పల్లి పోలీస్ స్టేషన్, మల్లాపూర్ పోలీస్ స్టేషన్,ఇబ్రహింపట్నం పోలీస్ స్టేషన్ ల పరిధిలోని నేరాల గురించి మెట్ పల్లి డి.ఎస్. పి శ్రీ రాములు గారితో కలిసి పోలీస్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ శ్రీ నిరంజన్ రెడ్డి గారు ఈ సమావేశం నిర్వహించారు.సర్కిల్ లోని వివిధ మర్డర్ కేసులు, లాండ్ సెటిల్ మెంట్ నేరాలు, అక్రమ ఇసుక రవాణా నేరాలు మరియు పలు చట్ట వ్యతిరేక పనులకు పాల్పడే వారి నేరాల గురించి సమీక్షించారు.నమోధిత పలు రౌడీ షీటర్ లను పిలిచి మాట్లాడడం జరిగింది.ఈ సమావేశం లో మెట్ పల్లి డి.ఎస్. పి శ్రీ రాములు గారు రౌడీ షీటర్ లతో మాట్లాడుతూ, ఇక నుండి ఎవరు చట్ట వ్యతిరేక పనులకు పాల్పడ కూడదని హెచ్చరించారు.ఎవ్వరు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా, సెటిల్మెంట్ ల పేరుతో సామాన్య ప్రజలని వేదించినా మరియు శాంతి భద్రతలకి ఆటంకం కలిగించినా వారిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఇలాంటి వారిపై పి.డి. ఆక్ట్ నమోదు చేస్తామని, అలాంటి నేరస్థులను తగిన రీతిలో శిక్షిస్తామని హెచ్చరించారు.ఇకనుండి ఎటువంటి నేరాలకు,చట్టవ్యతిరేక కార్యకలాపాల పాల్పడకూడదని, అటువంటి నేరాలనుండి తప్పుకోవాలని చెప్పారు.గత నేర స్వభావాన్ని విడిచిపెట్టి, సమాజంలో అందరితో కలిసి శాతియుత జీవితం కొనసాగించాలని చెప్పారు.సంఘటిత జీవితం గొప్పదని, మంచి ప్రవర్తనను కొనసాగించమని ఉద్బోధించారు.సాధారణ జీవితాన్ని, చట్టాన్ని గౌరవించే జీవితాన్ని గడపండి అని చెప్పారు.మార్పు చెందిన వారికి పోలీస్ డిపార్ట్ మెంట్ కావలసిన సహకారం అందిస్తుందని డి.ఎస్. పి గారు అన్నారు.ఈ హెచ్చరికలను పాటించడంలో విఫలమైతే అరెస్టు మరియు ప్రాసిక్యూషన్‌తో సహా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపినారు. 26 నవంబర్ "భారత రాజ్యాంగ దినోత్సవం" అని అందరికీ సమాన హక్కులు కల్పించిన మన రాజ్యాంగ స్ఫూర్తిని అలవర్చుకొని సద్బుద్ధితో మెలగాలని కోరుతూ అందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఇట్టి సమావేశం లో మల్లాపూర్ ఎస్.ఐ. శ్రీ పి.కిరణ్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.కోరుట్ల మెట్ పల్లి ప్రాంత ప్రజల గురించి, సామాజిక సమస్యల గురించి సంపూర్ణ అవగాహన ఉన్న డి.ఎస్.పి గారి చేతుల్లో శాంతి భద్రతలు రక్షించబడతాయని అన్ని వర్గాల ప్రజలు ఆశిస్తున్నారు.

## రాజ్యాంగం తోటే రక్షణ అందరికీ.... ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ.



**కరపత్రం గన్నేరువరం నవంబర్ 25:**
రాజ్యాంగం తోటే అన్ని వర్గాల ప్రజల కు రక్షణ లభిస్తుందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.గన్నేరువరం మండలంలోని చొక్కా రావు పల్లి గ్రామంలో 13 లక్షల నిధులతో పాఠశాల ప్రహరీ గోడ పనులకు శంకుస్థాపన చేశారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో 36 పశువుల పాకల నిర్మాణ పనులను ప్రారంభించారు. గుండ్లపల్లి స్టేజ్ లో నూతన గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా చొక్కా రావు పల్లిలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞను చేశారు. ఎమ్మెల్యే కవంపల్లి మాట్లాడుతూ దేశం సుస్థిరంగా ఉండాలంటే, బడుగు బలహీన వర్గాలకు సమాన న్యాయం లభించడానికి రాజ్యాంగం ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. కొంతమంది రాజ్యాంగాన్ని సవరణ చేసి బడుగు బలహీన వర్గాలకు అన్యాయం చేయడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసిన పశువుల పాకల నిర్మాణాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముసుకు ఉపేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు చిటుకూరి అనంతరెడ్డి, నాయకులు బెతల్లి రాజేందర్ రెడ్డి, వంగల సత్యనారాయణ రెడ్డి, నరసింహారెడ్డి, నాయకులు బొడ్డు సునీల్, బద్దం సంపత్ రెడ్డి, దుడ్డు మల్లేశం, బూర వెంకటేశ్వర్లు, మాతంగి అనిల్, చింతల శ్రీధర్ రెడ్డి, పరిపూర్ణ చారి, బుర్ర శ్రీకాంత్ గౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మానసా దేవి ఆలయంలో కార్తీక శోభ....

**కరపత్రం గన్నేరువరం నవంబర్ 25:**
కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల గన్నేరువరం: మండలంలోని కాసింపేట గ్రామంలో స్వయంభుగా వెలసిన శ్రీ మానసా దేవి అపురూప లక్ష్మి 6 వ మహా శక్తి పీఠం ఆలయంలో కార్తీక పౌర్ణమి చివరి మంగళవారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.108 జంట నాగ లింగాలకు భక్తులు నీళ్లు పోసి ఆ పరమశివుని దర్శించుకున్నారు. అనంతరం భక్తులు అమ్మవార్లను దర్శించుకొని కోరిన కోర్కెలు నెరవేరాలని వేడుకున్నారు. మహిళలు తులసి కళ్యాణం లో పాల్గొని ఉసిరికాయలలో నెయ్యితో దీపాలు వెలిగించారు. భక్తిశ్రద్ధలతో భక్తులు ఆలయంలో దీపాలు వెలిగించారు. ఆలయం దీపాల కాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి.

# మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి

- మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి

**తిమ్మాపూర్ నవంబర్ 26 కరపత్రం**
గ్రామాల్లో అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం తిమ్మాపూర్ మహాత్మాజ్యోతీరావు ఫూలే మోడల్ స్కూల్ లో గ్రామీణ రహదారుల నిర్మాణం (సీఆర్ఆర్) నిధులు 60 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు, మహాత్మానగర్ ఉపాధిహామీ పథకం కింద రూ.22 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు ఆయన భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు



చేపడుతున్నామన్నారు. ఈ నిధులతో పంచాయతీ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం, రవాణా సౌకర్యాలు మెరుగుపర్చేందుకు వీలుగా రోడ్ల నిర్మాణం వంటి పనులు చేపడుతున్నామని ఆయన వివరించారు. ఆయా అభివృద్ధి పనులు చేపట్టడం వల్ల గ్రామాలు, పల్లెల రూపురేఖలు మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం పనులతో అటు పల్లెల అభివృద్ధి చెందడమే కాకుండా ఇటు వలసల నివారణ జరుగుతోందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ చంద్రశేఖర్, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ మంజులాభార్గవి,మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయ్ కుమార్, ఎంపీవో సురేందర్, పంచాయతీరాజ్ ఏఈ సురేందర్ రెడ్డి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుంట రాజేందర్ రెడ్డి, గంకిడి లక్ష్మారెడ్డి, పోలు రాము, నగునూరు శ్రీనివాస్, గవ్వల రాజేందర్ రెడ్డి, గవ్వల రవీందర్ రెడ్డి, గూడ కమలాకర్, దుర్గా ప్రసాద్, మధుకర్ రెడ్డి, సమద్, పోలు రమేశ్, ఆసిక్ పాషా, మాచర్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
బుధవారం ,నవంబర్ 27, 2024



## ఆయన నాకు తండ్రిలాంటి వారు

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ తన భార్య సైరా భానుతో విడిపోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఇక రెహమాన్ దంపతులు విడాకులు ప్రకటించిన గంటల వ్యవధిలోనే రెహమాన్ మ్యూజిక్ బృందంలోని బాసిస్ట్ మోహినీ దే కూడా తన భర్తతో విడాకులు ప్రకటించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ ఇద్దరి మధ్య సంబంధం ఉందని అందుకే విడాకులు తీసుకోబోతున్నారని వార్తలు వచ్చాయి. దీనిపై మోహిని మరోసారి స్పందించారు. రెహమాన్ తనకు తండ్రిలాంటి వారని చెప్పుకొచ్చారు. తనది, రెహమాన్ కుమార్తెలది ఒకే వయసు అని.. ఆయనెప్పుడూ తనని కుమార్తెలానే చూసేవారని తెలిపింది. ఎనిమిదేళ్లుగా ఆయన బృందంలో పనిచేస్తున్నట్లు తెలిపింది. రెహమాన్ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని స్పష్టం చేసింది. ఆయన తనకు తండ్రితో సమానమని స్పష్టం చేసింది. తన కెరీర్‌లో ఆయన కీలక పాత్ర పోషించారని వివరించింది. అలాంటి తమపై ఇలాంటి వార్తలు రావడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేసింది. ఇలాంటి సున్నితమైన అంశాల్లో సానుభూతి లేకుండా నిందలు వేయడం సరికాదని పేర్కొంది. ఇక్కడితో ఈ రూమర్స్‌కు ఫుల్‌స్టాప్ పెట్టి.. తమ గోప్యతను గౌరవించాలని కోరింది. ఈ మేరకు ఓ వీడియో విడుదల చేసింది. ఏఆర్ రెహమాన్ 1995లో సైరా భానును వివాహం చేసుకున్నారు. ఇద్దరి మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఈ జంట విడిపోతున్నట్లు ఇటీవలే ప్రకటించారు. 29 ఏళ్ల వైవాహిక జీవితానికి ఇద్దరూ పరస్పర అంగీకారంతో ముగింపు పలికారు. ఇక ఈ దంపతులకు ఖతీజా, రహీమా, అమీన్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ముగ్గురు పిల్లలకు పెళ్లయ్యింది. వైవాహిక బంధంలో ఏర్పడిన భావోద్వేగ క్షణం తర్వాత ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఏఆర్ రెహమాన్ న్యాయవాది తెలిపారు. ఒకరిపై ఒకరికి అమితమైన ప్రేమ ఉన్నా.. ఉద్రిక్తలు, ఆందోళనలు వారి మధ్య గ్యాప్‌ను పెంచాయని.. ఆ అగాధాన్ని పూడ్చేందుకు ఎవరు కూడా సిద్ధంగా లేరన్నారు.

# ఎప్పుడూ రాజీ పడొద్దు..

## వేధింపులపై ఐశ్వర్యరాయ్ కామెంట్స్



వేధింపులను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై నటి ఐశ్వర్యరాయ్ మాట్లాడారు. ఓ బ్యూటీ ప్రొడక్ట్ ప్రచారంలో భాగంగా ఆమె ఓ వీడియోను విడుదల చేశారు. అందులో మహిళల గురించి మాట్లాడారు. 'మహిళలు నిత్యం వేధింపులకు గురవుతున్నారు. అలాంటివాటిని ధైర్యంగా ఎదుర్కోవాలి. తలెత్తి ఎదుటివారి కళ్లలోకి చూడాలి. మన శరీరం మనకు విలువైనది. దాని విషయంలో ఎప్పుడూ రాజీ పడొద్దు. దాని విలువ కోసం మిమ్మల్ని మీరు ఎట్టి పరిస్థితుల్లోనూ తక్కువ చేసుకోకండి' అని ఐశ్వర్య పేర్కొన్నారు. ఈ వీడియోపై ఆమె అభిమానులు స్పందిస్తున్నారు. 'మీరు ఎంతోమందిలో స్ఫూర్తినింపుతున్నారు', 'ఇది అందరూ తెలుసుకోవాల్సిన విషయం', 'సమాజం కోసం మీరెప్పుడూ ముందుంటారు' అంటూ కామెంట్స్ పెడుతున్నారు. ఐశ్వర్య చివరిసారి మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'పొన్నియిన్ సెల్వన్-2'లో కనిపించారు. ఈ సినిమాలో నటనకు ఆమె ఉత్తమ నటిగా సైమా అవార్డును గెలుచుకున్నారు. తన భర్త అభిషేక్‌తో కలిసి మణిరత్నం దర్శకత్వంలో నటించనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ చర్చల దశలోనే ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో అభిషేక్-ఐశ్వర్యలు కలిసి చాలా సినిమాలు చేశారు. వాటిలో మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'గురు' ప్రత్యేకమైనది. వీరి వివాహానికి కొన్ని రోజుల ముందు ఈ సినిమా విడుదలై ఆకట్టుకుంది. ఇప్పుడు మరోసారి ఈ జంట బిగ్ స్క్రీన్‌పై కనిపించనుందని వార్తలు వస్తుండడంతో అభిమానులు ఆనందిస్తున్నారు.

# అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకేలో శ్రీలీల



టాలీవుడ్ యాక్టర్ బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న టాక్ షో అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకే. బాలకృష్ణ సీజన్ 4లో ఎంటర్‌టైన్ మెంట్ డోస్ పెంచుతూ కొత్త కొత్త సెలబ్రిటీలతో సందడి చేస్తున్నాడు. ఇటీవలే పుష్ప 2 ది రూల్ ప్రమోషన్స్‌లో భాగంగా పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ అన్‌స్టాపబుల్ విత్ ఎన్‌బీకేలో బాలకృష్ణతో సందడి చేశాడని తెలిసిందే. ఈ ఎపిసోడ్ కూడా నెట్టింట వైరల్ అవుతోంది. భగవంత్ కేసరిలో బాలకృష్ణతో కలిసి నటించిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరి కాంబోకు మంచి ప్రశంసలు దక్కాయి. తాజాగా బాలయ్య, శ్రీలీల మరోసారి సందడి చేయబోతున్నారన్న వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజాగా మరో అతిథిగా డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలను ఫైనల్ చేశారు మేకర్స్. శ్రీలీల అన్‌స్టాపబుల్ తాజా ఎపిసోడ్ షూట్‌లో జాయిన్ అయింది. స్లీవ్ లెస్ టాప్, చీరకట్టులో క్యారవాన్ ముందు హొయలు పోతున్న స్టిల్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంతకీ శ్రీలీల ఎపిసోడ్ ప్రోమో ఎప్పుడొస్తుందనేది తెలియాల్సి ఉంది. అన్‌స్టాపబుల్ షోలో శ్రీలీల తర్వాత రాబోయే గెస్ట్ నవీన్ పొలిశెట్టి అని ఫిలింనగర్ సర్కిల్ టాక్.

## ఇక్కడ ప్రతిదీ కష్టమే : కృతిసనన్



ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చితనకంటూ ప్రత్యేకంగా ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది కృతిసనన్. తెలుగులో మహేశ్ బాబుతో వన్ నేనొక్కడినే, నాగచైతన్యతో దోచెయ్ సినిమాల్లో మెరిసిన ఈ భామ ప్రస్తుతం హిందీపైనే ఫోకస్ పెట్టిందని తెలిసిందే. ఈ బ్యూటీ 2024 ఈవెంట్‌లో సందడి చేసింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఇంటర్వ్యూలో ఇండస్ట్రీలో నెపోటిజమ్ (బంధు ప్రీతి)తోపాటు తన డ్రీమ్ రోల్ ఏంటో చెప్పుకొచ్చింది. డ్రీమ్ రోల్ గురించి మాట్లాడుతూ.. నాకు సూపర్ ఉమెన్ పాత్ర చేయాలని ఉంది. పూర్తిగా నెగెటివ్ పాత్రలో నన్ను నేను ఆవిష్కరించుకోవాలనుకుంటున్నానని చెప్పింది. నెపోటిజమ్‌కు ఇండస్ట్రీ పెద్దగా బాధ్యత వహించదని నేను భావిస్తున్నా. కానీ ఈ విషయంలో మీడియా, ప్రేక్షకులు చాలా కీలక పాత్ర పోషిస్తారు. కొందరు స్టార్ కిడ్స్ పట్ల మాత్రం మీడియా ఎలా వ్యవహరిస్తుందో ప్రేక్షకులు చూడాలనుకుంటారు. ప్రేక్షకులు ఆ స్టార్ కిడ్స్ పట్ల ఆసక్తి చూపించడం వల్ల వారితో సినిమా చేయాలని ఇండస్ట్రీ భావిస్తుంది. ఇది ఒక సర్కిల్ అని నేననుకుంటున్నానంది.

మీరు ప్రతిభావంతులైతే ఇండస్ట్రీకి చేరుకుంటారు. ప్రతిభావంతులు కాకపోతే, ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వలేకపోతే, అక్కడికి చేరుకోలేరు. నేను వచ్చినప్పటి నుంచి ఇండస్ట్రీ నాకు సాదర స్వాగతం పలికింది. మీరు సినిమా బ్యాక్ గ్రౌండ్ నుంచి రానప్పుడు.. మీరు కోరుకున్నది అందుకునేందుకు సమయం పడుతుంది. మ్యాగజైన్ కవర్‌లో చోటు సంపాదించుకోవడానికి కూడా టైం పడుతుంది. కాబట్టి ప్రతిదీ కొంచెం కష్టంతోనే కూడుకుని ఉంటుందని చెప్పుకొచ్చింది.

## 'జీబ్రా' విషయంలో అలా జరగకూడదని కోరుకుంటున్నా



సత్యదేవ్, డాలీ ధనంజయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జీబ్రా'. ఇటీవల విడుదలైన ఈ సినిమా ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. దీంతో అభిమానులకు థ్యాంక్స్ చెబుతూ సత్యదేవ్ ఓ నోట్ విడుదల చేశారు."ఇది మీరిచ్చిన విజయం. మీరు ఈ సినిమా బాగుందన్నారు. ఇంతకన్నా నాకేం కావాలి. ఇలాంటి హిట్ కోసం 5 సంవత్సరాల నుంచి నిరీక్షిస్తున్నా. మీకు నచ్చే సినిమా చేయడానికి, మీతో హిట్ కొట్టావ్ అని అనిపించుకోవడానికి ఎంతో ఎదురుచూశాను. నేను హిట్ కొడితే, మీరు ఆనందిస్తున్నారు. నాకెంతో సంతోషంగా ఉంది. 'బ్లఫ్ మాస్టర్' సినిమాని మీరు థియేటర్‌లో చూడలేకపోయారు. తర్వాత ఓటీటీ, యూట్యూబ్‌లో చూసి ఎంతో ఆదరించారు. 'జీబ్రా' విషయంలో అలా జరగకూడదని కోరుకుంటున్నా. దయచేసి ఈ చిత్రాన్ని థియేటర్‌లో చూడండి. మీ అందరికీ కచ్చితంగా నచ్చుతుంది" అని రాసుకొచ్చారు. తెలుగు ప్రేక్షకుల ప్రేమకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు.ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వంలో బ్యాంకింగ్ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. ఎస్ఎన్ రెడ్డి, బాల సుందరం, దినేశ్ సుందరం సంయుక్తంగా నిర్మించారు. ప్రియా భవానీ శంకర్, జెన్నిఫర్ పిషినాటో కథానాయికలు. ఈ సినిమా సక్సెస్‌పై ఇటీవల సత్యదేవ్ సక్సెస్ మీట్‌లో మాట్లాడుతూ.. చిరంజీవి చెప్పినట్లే ఈ బొమ్మ సూపర్ హిట్టయ్యిందన్నారు. ఈ చిత్రంలో ప్రతి పాయింట్‌కు ఒక లాజిక్ ఉందని చెప్పారు.

## నన్ను సెకండ్‌హ్యాండ్ అన్నారు : సమంత



నాగచైతన్యతో విడాకుల గురించి సమంత తాజాగా మరోసారి స్పందించారు. డివోర్స్ తర్వాత తనపై చాలా రూమర్స్ వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎన్నో ట్రోలింగ్స్‌ను ఎదుర్కొన్నట్లు చెప్పుకొచ్చారు. కొందరు తనను 'సెకండ్ హ్యాండ్' అని కామెంట్ చేశారని తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సమంత మాట్లాడుతూ.. 'విడాకులు తీసుకుంటే దాన్ని జనం ఫెయిల్యూర్‌గా పరిగణిస్తారు. ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవడం చాలా కష్టంగా ఉంటుంది. పెళ్లైన నాలుగేళ్లకే చైతన్యతో విడాకులు తీసుకున్న తర్వాత నేను ఎన్నో తీవ్రమైన ట్రోలింగ్స్‌ను ఎదుర్కొన్నా. నన్ను కొందరు 'సెకండ్ హ్యాండ్' అని కామెంట్ చేశారు. నాపై చాలా రూమర్స్ వచ్చాయి. ఎన్నో అబద్ధాలు వ్యాప్తి చెందాయి. అవన్నీ నిజం కాదని చాలా సార్లు బయటకు వచ్చి చెప్పాలని అనిపించింది. కానీ చెప్పడం వల్ల ప్రయోజనం ఏమీ ఉండదని ఆగిపోయాను' అంటూ సామ్ చెప్పుకొచ్చింది.